TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

## తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రెస్ నోట్

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో **21.12.2013,** శనివారం సాయంత్రం హిమాయత్‌నగర్ లోని చంద్రం భవన్‌లో ఈ వారం **'అసెంబ్లీలో తెలంగాణ బిల్లు–రాజకీయ పార్టీల దృక్కోణాలు'** అనే అంశంపై 101'వ చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, ఫార్మర్ రిజిస్ట్రార్ ప్రొ॥ కె. ముత్యం రెడ్డి అధ్యక్షతన, శ్రీ కొంపల్లి యాదవ్‌రెడ్డి, ఎమ్ఎల్‌సి, కాంగ్రెస్, శ్రీ బోయినపల్లి వినోద్‌రావు, మాజీ ఎంపి, టిఆర్ఎస్, శ్రీ పి. మహేందర్ రెడ్డి, ఎమ్ఎల్ఎ, టిడిపి, శ్రీ ఎండల లక్ష్మీనారాయణ, ఎమ్ఎల్ఎ, ఫ్లోర్ లీడర్, బిజెపి, శ్రీ గుండా మల్లేష్, ఎమ్ఎల్ఎ, ఫ్లోర్ లీడర్, సిపిఐ, శ్రీ జూలకంటి రంగారెడ్డి, ఎమ్ఎల్ఎ, సిపిఎమ్ ...వక్తలుగా ప్రసంగించారు.

100 చర్చలు పూర్తి చేసుకున్న టిఆర్‌సికి మొదట కృతజ్ఞతలు. ఈ వంద చర్చలు జరగడానికి కారణమైన శక్తి తెలంగాణ ఉద్యమం. ఈ ఉద్యమానికి ఉన్నటువంటి నేపథ్యం చాలా గొప్పది. ఈ ఉద్యమం అర్థమైనవారు–అయి, కానట్టు నటిస్తున్నవారు చాలా మంది మనకు ఈ రోజు కనిపిస్తున్నారు. ఈరోజు డ్రాఫ్ట్ బిల్లు మీద చర్చలో ఏ పార్టీ అభిప్రాయాలేమిటో (పార్టీల, వ్యక్తుల అభిప్రాయాలు మనందరికీ తెలుస్తున్నవే అయినా) అసెంబ్లీలో చర్చ జరగాల్సి ఉంది. బిల్లులో చాలావరకు తప్పులున్నాయనే వాదన ఉండనే ఉంది. అయితే ఆ తప్పులు,పొరబాట్లు, సాంకేతికపరమైనవా లేక విషయపరమైనవాటికి సంబంధించినవా అనేది చాలా ముఖ్యం.

తెలంగాణ అంశం పట్ల పుస్తకాలు, సాహిత్యం, కరపత్రాలు కొన్ని టన్నులకొద్దీ ఉన్నాయి. అదే సమైక్య ఉద్యమంలో 4 పుస్తకాలు చూపించమంటే చూపించలేరు అనే మాట వాళ్ళతో అంటే వాళ్ళు ఆఫ్ రికార్డులో ఒప్పుకుంటారు. డ్రాఫ్ట్ బిల్లుపై చర్చను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత, బిల్లును చదివిన తర్వాత, బిల్లుపై చర్చకు స్పీకర్ ఆదేశించిన తర్వాత చర్చ మొదలుకాలేదనడం సరికాదు. ఇది కేవలం ముగ్గురు నాయకుల కుట్ర మాత్రమే. మేం అధిష్టానంతో కూడా చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రి కావాలనే ఈ బిల్లుపై చర్చను జరగనివ్వడంలేదని చాలా స్పష్టంగా వివరించాం. ఓటింగ్‌కు అవకాశం లేదంటే ఓటింగ్ కావాలని అడగడం సీమాంధ్ర నాయకుల మూర్ఖత్వమే. ఈ డ్రాఫ్ట్ బిల్లుపై ఇప్పుడు చర్చ జరగకుండా అడ్డుకుని చివరి రెండు మూడు రోజులు చర్చించి, మాకు సమయం సరిపోలేదని మరికొంత సమయం ఇవ్వమని అడిగే అవకాశం ఉమదనే వాదనలు వస్తున్నాయి. కానీ ఇది రాష్ట్రపతి ఒప్పుకోకపోవచ్చు. కాబట్టి జనవరిలో జరిగే స్పెషల్ సమావేశాలలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందుతుందని భావిస్తున్నాం. గతంలో మధ్యప్రదేశ్‌లో 1రోజు, బీహార్‌లో 9గంటలు మాత్రమే ఆయా రాష్ట్రాల విభజన సందర్భంగా చర్చ జరిగింది. మనకు 26 రోజులు ఇచ్చినా సరిపోదు అనడం సరికాదు కాబట్టి ఆ ముగ్గురూ సహకరించాలని కోరుతున్నాం. ఏది ఏమైనా ఫిబ్రవరిలో రెండు రాష్ట్రాలకు ప్రత్యేక ప్రభుత్వాలు ఏర్పడతాయని ఆశిస్తున్నాం. ఈ బిల్లు సమయంలోపల వెళ్ళకపోతే రాష్ట్రపతి పార్లమెంటుకు బిల్లు పంపిస్తారని ఆశిస్తున్నాం.

TRC
TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

అసలు సీమాంధ్ర నాయకులు అడ్డుకోవడమే లక్ష్యంగా ఉన్నారు కాబట్టి చర్చకు చోటు లేకుండా చేస్తున్నారు. కాబట్టే వాళ్ళే మళ్ళీ కొత్తగా తెలంగాణ ఎందుకోసమనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. సభ మరోవైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ జరుగుతాయని తెలిసే చాలా దూర దృష్టితో డా॥ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారు. ఆర్టికల్ 3 ప్రకారం చాలా స్పష్టంగా ఈ రాష్ట్ర విభజన జరుగుతుంది. డిఫెన్స్ మినిష్టర్ నడిపే విమానంలోనే ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు వస్తారు. అందులోనే ఈ బిల్లు కూడా వచ్చింది. కాబట్టి చంద్రబాబు వాదన సరికాదు. రాష్ట్రాల వరుసక్రమం ఆల్ఫాబెటిక్ ప్రకారం తమిళనాడు, తర్వాత తెలంగాణ వచ్చింది. కాబట్టి వరుసక్రమంపై మాట్లాడటం సరికాదు అని వక్తలు పేర్కొన్నారు.

ఆర్టికల్ 368కు సంబంధించి కూడా స్పష్టంగా అవగాహన లేకనో, కావాలనో మీడియా రాద్ధాంతం చేస్తోంది. అది ఎంత చెప్పినా వాళ్ళు మారడంలేదు. ఇది సరైనది కాదు. అంతేకాక తెలంగాణ వాళ్ళుకానీ, సీమాంధ్రులు కానీ బిల్లుకోసం వారి అభిప్రాయాలను

పంపించే హక్కు ఉన్నది. దాన్ని అందరూ ఉపయోగించుకోవాలి. అనేక అంశాలపై అభిప్రాయాలు పంపే అవసరం ఉంది. ఏది ఏమైనా రాష్ట్ర ఏర్పాటు తథ్యం అని వక్తలు పేర్కొన్నారు.

ఈ 101వ చర్చా కార్యక్రమంలో టిఆర్‌సి 100వ చర్చ టాబ్లాయిడ్‌ను ఆవిష్కరించారు.

ఈ చర్చా కార్యక్రమంలో టిఆర్‌సి ఛైర్మన్ శ్రీ ఎమ్. వేదకుమార్, ప్రొ. అన్వర్‌ఖాన్, విద్యాధర్ రెడ్డి, డి.అశోక్, ఆర్. వెంకట్‌రెడ్డి, ప్రజా కళామండలి కోటి, కొమ్మిడి నర్సింహారెడ్డి, అంజయ్య, దినేష్, ధనుంజయ్ మొ॥వారు పాల్గొన్నారు.

**బోనకుర్తి సోమేశ్వర్**

**కో-ఆర్డినేటర్, టిఆర్‌సి**